## క్లుప్తంగా

### 160 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

**వినుకొండ(నూజెండ్ల):** అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. జిల్లాకలెక్టరు ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం తనిఖీలు చేపట్టి వినుకొండ రూరల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 160 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసున్నారు. వినుకొండ సివిల్ సప్లయ్ డీటీ మురళీధరరావుతోపాటు మాచర్ల, వినుకొండ రెవెన్యూ ఇన్స్పెక్టర్లతో కలసి బ్రాహ్మణపల్లి గ్రామంలోని శ్రీవెంకటేశ్వర రైస్‌మిల్లులో తమిళనాడుకు చెందిన లారీలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే స్టాకు రిజిస్టర్లో నమోదుకాని మరో 24 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి సివిల్ సప్లయ్ గోడౌన్‌కు తరలించారు. వారిపై 6 ఏ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు మురళీధరరావు తెలిపారు.

### రెవెన్యూ కోర్టును సద్వినియోగించుకోవాలి



**వినుకొండ(నూజెండ్ల):** రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ కోర్టును సద్వినియోగించుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ కోర్టు నిర్వహించారు. ఈ సందర్భంగా వినుకొండ రూరల్ మండలంలోని చీకటీగలపాలెం గ్రామానికి చెందిన నిరుపేద మహిళ అంజమ్మ భూమిని కొందరు ఆక్రమించారని, ఇరువర్గాలను పిలిపించి సమస్యను పరిష్కరించారు.

### సంక్షేమ క్యాలెండర్‌పై అవగాహన

**వినుకొండ(నూజెండ్ల):** అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిధంగా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు వార్డు కౌన్సిలర్ షకీలా దస్తగిరి అన్నారు. పట్టణంలోని 1వార్డు సచివాలయంలో ప్రభుత్వం విడుదల చేసే సంక్షేమ క్యాలెండర్‌పై లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, వైస్ చైర్మన్ గాబ్రియేలు, కౌన్సిలర్ ఎంఎస్‌కే బాషా తదితరులు పాల్గొన్నారు.

### చెకుముకి సైన్స్ సంబరాలు


**వినుకొండ (నూజెండ్ల):** పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ నందు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఆయా పాఠశాలల్లో 8,9,10 తరగతులు చదువుతున్న 2 వేల మంది విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈవో జప్రుల్లా మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల్లో మూఢ నమ్మకాలు పోగొట్టి సైన్స్ పట్ల అవగాహన కల్పించేలా ఉన్నాయని అభినందించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సభ్యులు సంద్రపాటి చలపతి రావు, సీహెచ్. చంద్రశేఖర్, రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నిద్ర మత్తు.. లారీ చిత్తు !



**యడ్లపాడు:** ప్రమాదవశాత్తు పదిటైర్ల లారీ బోల్తా కొట్టిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపూర్ నుంచి చెన్నై కరెంటు సామగ్రి లోడుతో వెళ్తున్న క్రమంలో ఎడ్లపాడు సినిమా హాలు వద్దకు రాగానే డ్రైవర్‌కు కళ్లు మూతపడ్డాయి. దీంతో వేగంగా ఉన్న లారీ అదుపు తప్పి ఎడమవైపు రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్‌ను ఢీకొంది. దీంతో ఎక్స్‌ప్రెస్ హైవేపై నుంచి సైడ్ డివైడర్ మీదుగా సర్వీసు రోడ్డులోకి వెళ్లి పల్టీ కొట్టింది. హైవే సైడ్‌గ్రిల్స్‌తో పాటు లారీలోని కరెంటు సామగ్రి సర్వీసు మార్గంలో చెల్లాచెదురుగా పడ్డాయి. లారీ ముందు భాగం ధ్వంసకాగా, ప్రమాదంలో డ్రైవర్ ఆర్. ముగమ్, క్లీనర్‌లు సురక్షితంగా బయట పడ్డారు. హైవే అంబులెన్స్ స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న హైవే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీని పక్కకు పెట్టించారు. రోడ్డుపై పడిన సామగ్రిని మారోలారీలోకి ఎక్కించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

### దంత సంరక్షణపై శ్రద్ధ చూపాలి



**చిలకలూరిపేట:** దంత సంరక్షణపై శ్రద్ధ చూపాలని దంతవైద్యురాలు శ్రీలక్ష్మి చెప్పారు. మండలంలోని పోతవరంగ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మౌలానా అబుల్‌కలాం అజాద్ జయంతిని పురస్కరించుకొని హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్ర వారం విద్యార్థులకు దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దంత ధావనం చేసుకొనే విధానం, దంత రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు అజాద్ దేశానికి అందించిన సేవల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అఫ్రిఫూన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలి

- అప్పుడే అందరి కుటుంబాల్లో సంతోషం
- రెండో వార్డు ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి
- వేర్వేరు ప్రాంతాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం
- ఉత్సాహంగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



చక్రాయపాలెంలో సంక్షేమ పథకాలు తెలిపే బోర్డు ఆవిష్కరణ ఇలా..

**నరసరావుపేట:** రాష్ట్రంలో ప్రజలు అందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలంటే వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ సీఎం జగన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం పట్టణంలోని రెండోవార్డు బలాబజారు, గుంటూరు రోడ్లలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల కోలాహలంగా మధ్య పర్యటించారు. సచివాలయంలో గత నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందిన సంక్షేమంపై ఏర్పాటుచేసిన బోర్డును ఆవిష్కరించారు. వార్డులో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తూ కొబ్బరికాయ కొట్టారు. ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డే కావాలనే బ్రోచర్లను ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇల్లిల్లూ తిరుగుతూ స్థానికులను అందుతున్న సంక్షేమ పథకాలను గురించి ప్రశ్నిస్తూ ఎందుకు మళ్లీ సీఎంగా జగన్ కావాలో వివరించారు. ప్రతిపేదవాడు మంచిగా జీవించాలనే లక్ష్యంతో సీఎం జగన్ అమలు చేస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ రాకముందు మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. దేశంలో ఎక్కడా లేని వ్యవస్థలను తీసుకొచ్చి అమలు చేస్తున్నారని, ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసం ఆరోగ్య సురక్ష అమలు చేశారన్నారు. తలసరి ఆదాయంలో దేశంలో 17వ స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని తొమ్మిదవ స్థానంకు వచ్చిందన్నారు. గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీఎస్‌డీపీ)లో చంద్రబాబు ఉండగా రాష్ట్రంలో 22వ స్థానంలో ఉండగా ఇప్పుడు మొదటిస్థానంకు వచ్చిందన్నారు. మన రాష్ట్రంలో అమలౌతున్న పథకాలు అమ్మఒడిని తమిళనాడు, రైతుభరోసా కేంద్రాలను కేరళ ప్రభుత్వం, ఇంటికే రేషన్ బియ్యం పంపిణీని పంజాబ్ రాష్ట్రంలో అమల్లోకి తీసుకొస్తున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థను దేశం మొత్తం అమలు చేయాలనే సంకల్పంతో ప్రధాని నరంద్రమోదీ ఆలోచనలో ఉన్నారన్నారు. దేశానికి ఆదర్శంగా సంస్కరణలు తీసుకొచ్చిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించిన సామాజిక న్యాయం అమలు చేసేందుకు పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా పథకాలను అమలుచేస్తున్న జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. రామ్మోహన్, డీఇ శ్రీనివాసరావు, షేక్ కార్పోరేషన్ చైర్మన్ షేక్ ఖాజావలి, పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, ముదిరాజు, గిరిజన, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లు ఇయం.స్వామి, పాలపర్తి వెంకటేశ్వరరావు, కందుల ఎజ్రా, మాజీ కౌన్సిలర్ మాడిశెట్టి మోహనరావు, వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి దివ్వెల రామకృష్ణ, వార్డు నాయకులు తిప్పరయ్య, షేక్ షబ్బీర్, ఐలా ఉమామహేశ్వరరావు, టమటం శ్రీనివాసరావు, నిమ్మిశెట్టి శ్రీను, షేక్ గఫూర్ పాల్గొన్నారు.

**ఈపూరులో...**

**ఈపూరు:** మండలంలోని ముప్పాళ్ల -1 సచివాలయంలో జగనే ఏపీకి ఎందుకు కావాలి ( వై నీడ్ జగన్ ) కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు దిగ్విజయంగా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని పలువురు అతిథులు ప్రసంశించారు. రూ. 98 శాతం హామీలు నెరవేర్చారని, మళ్లీ ఆయనే ముఖ్యమంత్రిగా రావాలని అన్నారు. రాష్ట్రంలో ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. గత ప్రభుత్వ పాలనలో అనుభవించిన కష్టాలను, ఈ ప్రభుత్వంలో జరిగిన మెరుగైన లబ్ధిని బేరీజు వేసుకొని ప్రజలు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బయ్యారపు రమ్య, జెడ్పీటీసీ సభ్యులు తుర్లపాటి చౌడయ్య, ఈపూరు సొసైటీ అధ్యక్షులు బొల్లా బుజ్జి, ఈవోఆర్‌డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రటరీ లహైమావతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

**యడ్లపాడులో...**

**యడ్లపాడు:** పేదల అభ్యున్నతే ధ్యేయంగా.. రాష్ట్ర ప్రగతి లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన చేస్తుందని, భవిష్యత్తులో ఆంధ్ర ప్రదేశ్ అగ్రగామిగా నిలిచేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని ఎంపీపీ పిడతల ఝాన్సీ పేర్కొన్నారు. ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం యడ్లపాడు గ్రామంలో శ్రీకారం చుట్టారు. గ్రామ సచివాలయం-1 వద్ద వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన సంక్షేమ అభివృద్ధి పథకాలు.. వాటి వివరాల ఫైలాన్ ఆవిష్కరించారు. యడ్లపాడు గ్రామం పరిధిలో రూ 27.27 కోట్లకు పైగా గ్రామ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించిందన్నారు. హైస్కూల్ రోడ్డులోని కోడలి వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ఇంటింటి సందర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కే.హేమ, జెడ్పీటీసీ ముక్తా వాసు ఏఎంసీ వైస్ చైర్మన్ ఎం.వీ రారెడ్డి, జీసీఎం కన్వీనర్ రాచమంటి చింతారావు, ఎంపీటీసీ కీర్తి అరుణ్ కుమార్, సొసైటీ చైర్మన్ బసెలా శివరామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఘంటా శంకర్, నాయకులు మాదం శ్రీనివాసరావు, కల్లూరి విజయ్ కుమార్, కే నాగమల్లేశ్వరరావు, యామర్తి కోటేశ్వరరావు, బందెల శ్రీను, ఆలోకం వెంకట లక్ష్మినారాయణ, పావులూరి వాసు, షంషు జుహా, వడ్డేపల్లి నరసింహారాజు, శ్రీధర్ శ్రీరామమూర్తి, ఉదయ్ కిరణ్, ఎంపీడీవో వై. హనుమారెడ్డి, వరూధిని పాల్గొన్నారు.

**చక్రాయపాలెంలో....**

**బొల్లాపల్లి:** ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని మండలంలోని చక్రాయపాలెంలో శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. జడ్పీటీసీ రామావతు బీమీబాయి, పార్టీ నాయకులు బి. భట్టునాయక్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నాలుగున్నరేళ్ల కాలంలో ప్రవేశపెట్టిన అమలు చేసిన సంక్షేమ పథకాలు తెలిపే బోర్డును సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ సచివాలయం పరిధిలో 14.81 కోట్లు మేర 814 మంది లబ్ధిదారులు నేరుగా, పరోక్షంగా లబ్ధిచేకూరిందని తెలిపారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో సచివాలయ వ్యవస్థ, వలంటీరు వ్యవస్థతో సంక్షేమం వెల్లివిరిసిందన్నారు.

**గొరిజవోలు గ్రామంలో....**

**నాదెండ్ల:** ఎన్నికల సమయంలో ప్రకటించిన మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లా భావించి 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందని ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. గొరిజవోలు గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.17.63 కోట్లు నిధులు ఖర్చు చేసినట్లు పైలాన్ ఆవిష్కరించారు. నవరత్నాల పథకాల్లో భాగంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. కార్యక్రమానికి సర్పంచ్ గొర్రెపాటి గృహలక్ష్మి అధ్యక్షత వహించగా, ఎంపీటీసీ గేరా సుహాసిని, నాదెండ్ల, గణపవరం సొసైటీల అధ్యక్షుడు కురుకుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు భవనం రఘు రామిరెడ్డి, కురుకుంట్ల రజని, షేక్ మస్తాన్‌వలి, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు పాల్గొన్నారు.

## రీసర్వేతో భూముల లెక్కలు పక్కాగా

- తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు
- దింతెనపాడు గ్రామంలో రీసర్వేపై గ్రామసభ



దింతెనపాడులో గ్రామసభలో పాల్గొన్న అధికారులు

**యడ్లపాడు:** రీ-సర్వేతో భూముల లెక్కలు పక్కాగా రూపుదిద్దుకుంటాయని తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు చెప్పారు. మండలంలోని గుత్తావారిపాలెం, దింతెనపాడు గ్రామాల్లో శుక్రవారం 'జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష పథకం'(స్వమిత్వ)పై గ్రామసభలు అధికారులు ఏర్పాటు చేశారు. ఈసభలో తహసీల్దార్, ఈవోపీఆర్డీ వరూధిని ఆయా గ్రామప్రజలకు రీసర్వే గురించి పలు అంశాల్ని తెలియజేశారు. సుదీర్ఘ కాలంగా ఉన్న భూ వివాదాలకు శాశ్వతంగా చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రీసర్వేకు శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లావ్యాప్తంగా తొలుత వ్యవసాయ భూములకు సర్వే నిర్వహిస్తూ వాటి సరిహద్దులతో సహా హక్కు పత్రాలను అందిస్తుందన్నారు. అలాగే పంచాయతీల్లో ఉన్న గృహాలకు సైతం స్వమిత్వా పథకం ద్వారా స్థల హద్దులను గుర్తించి గృహ యజమానులకు శాశ్వత హక్కు పత్రాలు అందించేందుకు కృషి చేస్తుందన్నారు. ఫేజ్-1 కింద ఎంపికైన గుత్తావారిపాలెం, దింతెనపాడు గ్రామాల్లో నివాసాలకు రీసర్వే చేయగా, గుత్తావారిపాలెంలో నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తయిందన్నారు. సదరు గ్రామంలో నివాసాలు 6.82 ఎకరాల్లో ఉండగా, వాటికి సంబంధించిన పంచాయతీ పార్శిల్ నంబర్లు 232 వచ్చాయన్నారు. దింతెనపాడులో 9.92 ఎకరాల్లో 553 పీపీఎల్ నంబర్లను గుర్తించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవరపు సుమతి, ఆర్ఐ చక్రవర్తి, కార్యదర్శి శోభన్ బాబు, వీఆర్వోలు నాగేంద్రబాబు, కోటేశ్వరరావు, సచివాలయం సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

**ఇదే వేదికపై...**

ప్రతి కుటుంబానికి కుళాయి.. ప్రతి ఇంటికి సురక్షిత నీరు అందించడమే జలజీవన్ మిషన్ లక్ష్యమని మిషన్ సమన్వయకర్త తేజ్‌సంగీత్ తెలిపారు. దింతెనపాడు గ్రామాన్ని జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా హర్‌ఘర్ జల్ గ్రామంగా ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించిన డిక్లరేషన్‌ను సర్పంచ్ సుమతికి అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సారథ్యంలోనే వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు



మాట్లాడుతున్న ఎంపీపీ మేడం జయరామిరెడ్డి

**వినుకొండ(నూజెండ్ల):** గ్రామస్థాయిలో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సంక్షేమం, అభివృద్ధి పథకాలు చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చారని ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అన్నారు. నూజెండ్ల గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారిణి షేక్ సుగుణాబేగం అధ్యక్షత జరిగిన మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రైతన్నలకు మెరుగైన సేవలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతులకు కావాల్సిన అన్నిరకాల సదుపాయాలను అందుబాటులో ఉంచారన్నారు. ఏవో మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటల సాగు కింద 80 శాతం రాయితీపై 8 క్వింటాల మినుములు, 40 శాతం రాయితీపై 67 క్వింటాళ్ల శనగలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గంధం బాలిరెడ్డి, కిష్టం ఏడుకొండలు, శ్రీనివాసరెడ్డి, ఏఈవో ఎలీషా పాల్గొన్నారు.

## గాజాపై మారణకాండకు వామపక్షాలు నిరసన

**నరసరావుపేట:** పాలస్తీనా గాజాలో జరుగుతున్న మారణకాండకు నిరసనగా శుక్రవారం రాత్రి వామపక్ష నాయకులు ఆర్టీసీ బస్టాండ్ వద్ద మార్కెట్ యార్డుకు ఎదురుగా క్రొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదంలో భాగంగానే గాజాపై ఇజ్రాయల్ దేశం మారణకాండకు శ్రీకారం చుట్టిందన్నారు.

## ఆటాడుకుందాం...రా!



కుర్చీలాటలో పాల్గొన్న బాలికలు



మోకులాగుడు పోటీల్లో బాలురు

జాలాది గ్రామంలో శుక్రవారం విద్యార్థులు వివిధ రకాల క్రీడాపోటీలు జరిగాయి. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక (ఏపీ) పాఠశాల ఆవరణలో హెచ్ఎం ఆలోకం లక్ష్మీతులసీ నిర్వహించారు. ఆటపాటలతోనే పిల్లలు మానసిక, శారీరక దృఢత్వాన్ని కలిగి ఉంటారనీ, ఈనెల 14 తేదీన బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు క్రీడాపోటీలు ఏర్పాటు చేశామని ఆమె వెల్లడించారు. విజేతలకు బాలల దినోత్సవం వేడుకల్లో బహుమతులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. -యడ్లపాడు

## నాడి పట్టి.. రోగ నిర్ధారణ చేసి..

- వేర్వేరు ప్రాంతాల్లో జగనన్న సురక్ష వైద్య శిబిరాలు
- బాపూజీ స్కూలు వైద్య శిబిరంలో 262 మందికి వైద్యసేవలు



ప్రకాష్‌నగర్ బాపూజీ స్కూలు ఆవరణలోని శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ఆషాలత

**నరసరావుపేట:** అందరికీ ఆరోగ్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం శుక్రవారం పట్టణంలోని ప్రకాష్ నగర్ కంభంపాలెం సమీపంలోని బాపూజీ మున్సిపల్ స్కూలు ఆవరణలో వైద్యాధికారులు నిర్వహించారు. శిబిరాన్ని మున్సిపల్ డీఇ ఓలేటి శ్రీనివాసరావు సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. షాలెం నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరంలో 262 మందికి వైద్యసేవలను డాక్టర్ ఆషాలత, డాక్టర్ పర్వీనా, డాక్టర్ కిరణ్మయి అందజేశారు. వైద్యసిబ్బంది రక్త పరీక్షలు, బీపీ, మధుమేహం నిర్వహించగా ఎంవీరెడ్డి కంటి హాస్పిటల్ సిబ్బంది కంటి పరీక్షలు చేశారు. ఆ వార్డు నాయకులు బండి వెంకటేశ్వరరెడ్డి, మాజీ కౌన్సిలర్ చల్లగుండ్ల సతీష్, పర్చూరి చిన్ని, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పర్యవేక్షించారు.

### నూతన దుస్తులు వితరణ

**శావల్యాపురం:** వేల్పూరు ఎస్సీ కాలనీలోని ఎంపీపీ స్కూలు విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ చర్మకారుల సంఘం వారి ఆధ్వర్యంలో నూతన దుస్తులు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు జి.ఉమామహేశ్వరి శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం చాలా అభినందనీయమన్నారు. శ్రీవంశీ డ్రెస్సెస్ వినుకొండ వారి సారథ్యంలో విద్యార్థులకు నూతన దస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా చర్మ కారుల సంఘం అధ్యక్షులు మాజీ జెడ్పీటీసీ సభ్యులు మల్లావరపు రవికుమార్, జుంజు యేహాను, ఎ. కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎ.జగదీష్, నాగమణి, శాంతమ్మ పాల్గొన్నారు.

### సర్వే వేగవంతం చేయాలి

**శావల్యాపురం:** గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు సర్వే పురోగతి వేగవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతన మరుగుదొడ్లు, ఆడుదాం ఆంధ్రా, జగనే ఎందుకు కావాలంటే తదితర కార్యక్రమాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామ సచివాలయంలో ఇప్పటి వరకు వివిధ పథకాల ద్వారా సంక్షేమము పొందిన లబ్ధిదారుల సమగ్ర వివరాలను డిజిటల్ బోర్డులు ద్వారా డిస్‌ప్లే చేయాలన్నారు.

## వేషం మార్చి.. డీజిల్ కాజేసి..

### దొంగల ముఠాలో యువకుడి అరెస్టు



తాతారావు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

**రొంపిచర్ల :** మండలంలోని మర్రిచెట్టుపాలెం గ్రామ సమీపంలో హైవేపై ఆగి ఉన్న లారీల్లో డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠాలోని ఒకరిని శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రూరల్ సీఐ ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు లోనై దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. ముఠాకు చెందిన కుంబా తాతారావును అరెస్ట్ చేశామన్నారు. సుబ్బయ్యపాలెం రాష్ట్ర రోడ్డుపై పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా అనుమానం వచ్చి ఈ వాహనాన్ని ఆపారు. తాతారావు పట్టుబడగా, మరో ఇద్దరు పరారీ అయ్యారు. పరారీ అయన వారిలో కొలికొండ వెంకట్రావు, కోనంకి వెంకట శివరామ్‌లు ఉన్నట్లు తెలిపారు. వారిని త్వరలో పట్టుకుంటామన్నారు. క్రోసూరి మండలం యర్రబాలెం గ్రామానికి చెందిన తాతారావుకు వెంకట శివరాములతో పరిచయమైంది. వీరు పేకాట, మద్యపానం లాంటి దురవ్యసనాలకు లోనై దొంగతనాలు చేస్తున్నారు. ఈ క్రమంలో సులభంగా దొంగతనాలు చేయాలని హైవే రోడ్డుపై ఆగి ఉన్న లారీల నుంచి డీజిల్ దొంగతనాలు చేస్తున్నారు. డీజిల్ దొంగతనాలు కూడా తెలుగు భాష మాట్లాడే వారి లారీలు కాకుండా ఇతర భాష మాట్లాడేవారి లారీల నుంచి డీజిల్ దొంగతనాలు చేస్తున్నారు. వారికి తెలుగు రాదని, పోలీస్ స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేయరనే ఉద్దేశ్యంతో ఆ లారీలను ఎంచుకుంటున్నారు. మర్రిచెట్టుపాలెం గ్రామంలో హేవేపై ఆగి ఉన్న లారీ నుంచి అయ్యప్ప స్వాముల వేషధారణలో ఉండి పైపుతో డీజిల్ దొంగిలిస్తున్నారు. అనుమానం వచ్చిన లారీ డ్రైవర్ రాజాల అంకిరెడ్డి కేకలు వేశాడు. వారు కారులో పారిపోయారు. లారీ డ్రైవర్ ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కుంబా తాతా రావును పట్టుకున్నట్లు తెలిపారు. విలేకర్ల సమావేశంలో సీఐతో పాటు ఎస్ఐ రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా ధన్వంతరి జయంతి

**వినుకొండ(నూజెండ్ల):** పట్టణంలోని ఎస్ఎస్‌పీ కాలనీలో పట్టణ గ్రామీణ పీఎంపీ ఆర్ఎంపీ వైద్యుల ఐక్యవేదిక యూనియన్ ఆధ్వర్యంలో వైద్యపితామహుడు ధన్వంతరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ పాశం నాగమల్లేశ్వరరావు ప్రసంగించారు. కార్యక్రమంలో కె.బ్రహ్మానందం, పి.రామలింగాచారి, యస్. కె.హుసేన్, ఎం.సాంబశివరావు, ఎస్.వెంకటేశ్వర్లు, నాసరయ్య, వి.శ్రీనివాసరావు, యు.పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

### పోలింగ్ బూత్‌ల పరిశీలన

**రొంపిచర్ల:** మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో పోలింగ్ స్టేషన్‌లను ఆర్డీఓ శేషిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. గ్రామంలోని 21. 24 పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో ఒకే ఇంట్లో 10 మంది ఓటర్లు ఉన్నా, 100 సంవత్సరాలు పైబడిన ఓటర్ల వివరాలను, మృతి చెందిన వారి వివరాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడితే అలాంటి వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీఎల్‌వోలు విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి. అంకారావు, చంద్రశేఖర్‌రావు, పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

### 13 నుంచి యోగ శిక్షణ శిబిరం

**నరసరావుపేట ఈస్ట్:** శ్రీవెంకటేశ్వర యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ నుంచి నెల రోజులపాటు 173వ ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు యోగ గురూజీ కూనిశెట్టి వెంకటజనార్దన్ శుక్రవారం తెలిపారు. శ్రీపట్టాభి రామస్వామి ఆలయంలో ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. వివరాలకు 9490846333, 9491665733 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

### నేడు విద్యుత్ అంతరాయం

**చిలకలూరిపేట:** విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలతో పాటు, చిలకలూరిపేట, నాదెండ్ల మండలాల పరిధిలోని పలు గ్రామాల్లోనూ సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

### లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు

**చిలకలూరిపేట:** తూకాలలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని లీగల్ మెట్రాలజీ గుంటూరు రీజనల్ జాయింట్ కంట్రోలర్ ఎంఎస్ మాధురి హెచ్చరించారు. తూనికలు, కొలతల శాఖాధికారులు శుక్రవారం పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. పెట్రోల్ బంకులు, వే బ్రిడ్జిలు, బాణాసంచా దుకాణాలు, ఐరన్ హార్డ్‌వేర్ దుకాణాల్లో తనిఖీలు కొనసాగాయి. ఇందులో భాగంగా వే బ్రిడ్జి, ఐరన్ హార్డ్ వేర్, బాణాసంచా దుకాణాలపై ఏడు కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ పల్నాడు జిల్లా సహాయ నియంత్రకులు ఎస్ అల్లూరయ్య, పరిశీలకులు సునీల్‌రాజు, శంకరరావు పాల్గొన్నారు.

### వైఎస్సార్ బీమా...

**రొంపిచర్ల:** మండలంలోని కొనకంచివారిపాలెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పానుగోటి సాంబయ్య కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం క్రింద తక్షణ సహాయంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల రూపాయలను పంచాయతీ సర్పంచ్ పానుగోటి నాసరరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### నరమేధాన్ని వ్యతిరేకించాలి

**చిలకలూరిపేట:** అమాయక పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న నరమేధాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ప్రొఫెసర్ జమీన్‌దార్ చెప్పారు. పాలస్తీనా ప్రజల సంఘీభావ మిత్రుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు నాయు డు శివకుమార్, వై.రాధాకృష్ణమూర్తి, నాగభైరు రామసుబ్బాయమ్మ, ఎం.రాధాకృష్ణ, నల్లపు కోటేశ్వరరావు, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

### నేడు మెగా వైద్య శిబిరం

**చిలకలూరిపేటటౌన్:** ఏసుక్రీస్తు దివ్యశాంతి నిలయం ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ పాస్టర్ నందమూరి క్రిష్టర్ చెప్పారు. కాటూరి మెడికల్ కాలేజీ, నెక్స్ జనరేషన్ సేవ్ ఆర్గనైజేషన్ సహకారంతో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు.



